క్లుప్తంగా

ఏకాదశ రుద్రుల కీర్తి.. దేశ వ్యాప్త ఖ్యాతి


ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: ఈ నెల 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా రిపబ్లిక్ పరేడ్‌లో కోనసీమ రుద్ర ప్రభలతో కూడిన శకటాన్ని ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రదర్శిస్తుండటంతో దేశ వ్యాప్త ఖ్యాతి చేకూరిందని పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఫోన్ ద్వారా విలేకరులతో మాట్లాడారు. వ్యక్తిగతంగా తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. ఏకాదశ రుద్రుల నమూనాతో కూడిన శకటాన్ని గణతంత్ర వేడుకల్లో ప్రదర్శిస్తుండటంతో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారు సైతం ఎంతో గర్వపడుతున్నారన్నారు. ప్రభల ఉత్సవంతో పాటు పరేడ్‌లో ప్రదర్శించబోయే గరగ నృత్యాలు, డోలు సన్నాయి, వాయిద్య కళాకారులు ఇతర చేతి వృత్తుల వారిని ఎమ్మెల్యే ఈ సందర్భంగా అభినందించారు. శకటాలను అందంగా తీర్చి దిద్దిన నిర్వాహక కమిటీతో పాటు ప్రభలు, జోడెడ్ల బళ్లు, పల్లకీ గ్రామోత్సవం తదితర అంశాలను ఎంతో రమణీయంగా తీర్చిదిద్దిన ప్రతి ఒక్క కళాకారుడికి పేరు పేరున అభినందనలు తెలిపారు.

బీసీల సంక్షేమానికి సీఎం జగన్ కృషి


చింతా కుమారి

మామిడికుదురు: బీసీల సంక్షేమానికి సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ చింతా కుమారి పేర్కొన్నారు. ఆమె సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో 56 కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్ల పదవీ కాలాన్ని మరో రెండేళ్లు పొడిగిస్తూ తీసుకున్న నిర్ణయం బీసీలపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని నిరూపిస్తోందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా చరిత్రలో చిర స్థాయిగా నిలిచిపోయే విధంగా జగన్ బీసీలకు అన్ని విధాలుగా ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. తనకు ఈ అవకాశం కల్పించిన ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, పార్టీ నాయకులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

నిత్యాన్నదానానికి రూ.10 వేల విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి సన్నిధిలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన ట్రస్టుకు రాజమహేంద్రవరానికి చెందిన నూరుకుర్తి సత్యానందం, శివమల్లిక దంపతులు సోమవారం రూ.10,116 విరాళంగా అందించారు. ఈ విరాళాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎంకేటీ నాగవరప్రసాద్, ఆలయ చైర్మన్ చిట్టూరి రామకృష్ణకు అందజేశారు. ఏటా ఏప్రిల్ 25న తమ కుమారుడు బాబు పుట్టినరోజు సందర్భంగా భక్తులకు అన్నదానం చేయాలని ఈ విరాళం అందించారు. సత్యానందం దంపతులకు స్వామి వారి చిత్రపటంతో పాటు ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు బోర్డు సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు పూర్వ విద్యార్థుల చేయూత

మామిడికుదురు: ప్రతిభావంతులైన విద్యార్థులకు ఆర్థికంగా చేయూతనందిస్తూ, వారిని ప్రోత్సహిస్తోందని పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు కడలి గోపాలకృష్ణ, నయినాల వేణు గోపాల్, మైలవరపు రవీంద్రనాథ్ పేర్కొన్నారు. 2008–09 సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థుల సంఘం వార్షికోత్సవం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయిని సీహెచ్ నిరంజని అధ్యక్షతన జరిగిన సభలో మండల స్థాయిలో పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులతో పాటు, మామిడికుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 6 నుంచి పదో తరగతి వరకు ప్రతిభ చూపిన విద్యార్థులకు రూ.32,500 నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నయినాల వాసు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహునికి ప్రత్యేక పూజలు

సఖినేటిపల్లి/మామిడికుదురు/అంబాజీపేట: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో సోమవారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పుట్టినరోజు సందర్భంగా పార్టీ నియోజకవర్గ శ్రేణులు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ఆధ్వర్యాన వీరంతా పూజలు చేశారు. అలాగే మామిడికుదురులోనూ యువగళం పాదయాత్ర విజయవంతం కావాలని ఆ పార్టీ శ్రేణులు బాలబాలాజీ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించాయి. ఈ నెల 27 నుంచి యువగళం యాత్ర విజయవంతం కావాలని కోరుతూ అంబాజీపేట శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆ పార్టీ నాయకులు పూజలు చేశారు.

బాలుడి వైద్యానికి ఆర్థిక సాయం

కొత్తపేట: అమలాపురంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కొత్తపేటకు చెందిన చోడపనీడి సత్యసాగర్(13)కు వైద్య ఖర్చుల నిమిత్తం స్థానిక యువ శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు బొక్కా ప్రసాద్, గౌరవాధ్యక్షుడు యనమదల శ్రీనివాస్, గౌరవ సలహాదారు కొప్పిశెట్టి వాసు తదితరుల ఆధ్వర్యంలో సభ్యులు ఆస్పత్రికి వెళ్లి రూ.20 వేలు అందజేశారు. ఫ్రీటైమ్ సర్వీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.41,000, మండల డ్వాక్రా యానిమేటర్స్ (వీఏఏ) సంఘం రూ.10 వేలు, స్థానిక విద్యా బాలమందిర్ ద్వారా రూ 5,500 అందజేశారు. ఈ సందర్భంగా వారికి బాలుడి తల్లి కృతజ్ఞతలు తెలిపింది.

అవినీతి రహిత పాలన సీఎంకే సాధ్యం

- ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు
- బట్టేలంకలో గడపగడపకూ..


బట్టేలంకలో మహిళకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

మలికిపురం: రాష్ట్రంలో అవినీతి రహిత పాలన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమైందని, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రజలకు సంక్షేమ పథకాలను అందించిన ఏకైక సీఎంగా జగన్ కీర్తికెక్కారని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని బట్టేలంకలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి వారికి ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ పథకాల వివరాలను, అందుతున్న తీరును లబ్ధిదారులను నేరుగా అడిగి ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ అర్హులకు పథకాలు అందకపోతే కారణాలను అడిగి తెలుసుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని లబ్ధిదారులకు సూచించారు. గ్రామాల్లో ఓట్లడిగే అర్హత ఒక్క వైఎస్సార్ సీపీకే ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మంగెన సింహాద్రి, మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల కాశి, కొడవటి దొరబాబు, కొల్లు శిఖామణి, గ్రామ పార్టీ అధ్యక్షుడు కడలి శ్రీను, బోనం సురేష్, తోటి నాగరాజు, కందికట్ల రత్న బాబు, వీఆర్వో మన్నె నాగబాబు, పంచాయతీ కార్యదర్శి ఇంజేటి శుభాకర్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీరభద్రుని సంబరం


అప్పనపల్లిలో నిర్వహిస్తున్న వీరభద్రస్వామి సంబరం

మామిడికుదురు: అప్పనపల్లిలో వీరభద్రస్వామి సంబరం సోమవారం వైభవంగా జరిగింది. మేళతాళాలు, సన్నాయి వాయిద్యాలు, భక్తుల కోలాహలం, బాణసంచా కాల్పులు, నృత్యాల నడుమ వైనతేయ గోదావరి నది వరకు స్వామిని ఊరేగింపుగా తీసుకెళ్లారు. అక్కడ నదిలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం నది వద్ద తులా వీరన్న కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో వీరభద్రస్వామి సంబరాన్ని ఘనంగా జరిపించారు. స్థానికంగా ఉన్న వీరభద్రస్వామి ఆలయం వద్ద విఘ్నేశ్వర పూజ, శమీవృక్షం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు వీరభద్రస్వామికి శూలాలతో వీరనాట్యం చేస్తూ పరవశింపచేశారు. ఈ పూజలు ఆద్యంతం కనులపండువగా నిర్వహించారు. పలువురు భక్తులు ఈ పూజల్లో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: గ్రామ శివారు కొర్లపాటివారిపాలెంలో పరసా రాజా, విశాలాక్ష్మి, పరసా భరత్, నిర్మల దంపతుల ఆధ్వర్యంలో సోమవారం వీరభద్ర స్వామి సంబరాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత స్వామిని పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. స్వామి వార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం భారీ అన్నసమారాధన జరిపారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ సుంకర పేరయ్యానాయుడు, సూదాబత్తుల రాము, గణపతి వీరరాఘవులు తదితరులు స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

విద్యకు ప్రభుత్వం పెద్దపీట


అయినవిల్లిలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఎంపీ చింతా అనురాధ


పుల్లేటికుర్రులో విద్యార్థులకు స్టడీమెటీరియల్ పంపిణీ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

అయినవిల్లి: రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ విద్యకు పెద్దపీట వేశారని అమలాపురం ఎంపీ చింతా అనురాధ అన్నారు. సోమవారం ముక్తేశ్వరం, నల్లచెరువు, నేదునూరు, శానపల్లిలంక, వీరవల్లిపాలెం, ఎస్.మూలపాలెం, కొండుకుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న 721 మంది విద్యార్థులకు ఎంపీ అనురాధ జగనన్న విద్యాభారతి స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ వేటుకూరి వెంకట్రాజు వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పీఏసీఎస్ చైర్మన్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదువుకోవాలి

అంబాజీపేట: పదో తరగతి విద్యార్థులు ఇప్పటి నుండే పక్కా ప్రణాళికతో చదువుకుంటే పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించవచ్చని జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. కె.పెదపూడి, పుల్లేటికుర్రు, ముక్కామల, గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం జెడ్పీ హైస్కూళ్లలో విద్యా భారతి పదో తరగతి స్టడీ మెటీరియల్‌ను ఎంఈఓ డి.కిష్టోఫర్ కొర్నాలియస్ సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ, ఎంపీపీలు మాట్లాడుతూ సీఎం జగన్ పంపిణీ చేసిన స్టడీమెటీరియల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కె.పెదపూడి 14, పుల్లేటికుర్రు 112, ముక్కామల 26, గంగలకుర్రు 41, గంగలకుర్రు అగ్రహారం 20 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కాండ్రేగుల శ్రీనివాసరావు, దొంగ నాగేశ్వరరావు, ఎంపీటీసీలు వడలి కృష్ణమూర్తి, వనచర్ల విజయదుర్గ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, నందుల ఆదినారాయణ, మైలా ఆనందరావు, అంబటి శ్రీను, వాసర్ల మరిడి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఫలితాలు

రాజోలు: ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఫలితాలు రావడం గర్వించదగ్గ విషయమని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. సోమవారం రాజోలు బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం సమకూర్చిన జగనన్న విద్యాభారతి ఉచిత స్టడీ మెటీరియల్‌ను ఎమ్మెల్యే విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను ప్రభుత్వం సమకూర్చిందన్నారు. మంచి ఫలితాలు సాధించాలని అందిస్తున్న స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అమ్మ ఒడి పథకం, నాడు–నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయన్నారు. ఎంపీడీఓ ఎస్.బాలాజీ, జెడ్పీటీసీ సభ్యురాలు మట్టా శైలజ, రాజోలు, సోంపల్లి సర్పంచ్‌లు రేవు జ్యోతి, కట్టా శ్రీనివాసరావు, ఎంపీటీసీ చెల్లింగి లక్ష్మీఈశ్వరి, ప్రధానోపాధ్యాయిని సుహాసిని, మట్టా ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

మలికిపురంలో..

మలికిపురం: రానున్న పదో తరగతి పరీక్షలలో విద్యార్థు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు సూచించారు. మండలంలోని విశ్వేశ్వరాయపురం ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రభుత్వం సమకూర్చిన పదో తరగతి స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు ఎమ్మెల్యే అందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బల్ల ప్రసన్నకుమారి, ఎంపీటీసీ గుబ్బల గౌరీ వెంకటపద్మావతి, ఎంఈఓ ఎం.విజయశ్రీ, సొసైటీ చైర్మన్‌లు చెల్లుబోయిన బుచ్చియ్య మాస్టారు, జాన శంకరరావు, నాయకులు ముత్యాల కాశి, మేడిచర్ల రాము, గుబ్బల రమేష్, జీవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

స్వచ్ఛభారత్‌ను పక్కాగా అమలు చేయాలి

మామిడికుదురు: కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీవేమా డిమాండ్ చేశారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మెండా ఆదినారాయణ ఆధ్వర్యంలో బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మకు అందించారు. గరీబ్ కల్యాణ్ పథకంలో రేషన్ దుకాణాల ద్వారా ఉచితంగా బియ్యం ఇస్తున్న షాపుల వద్ద మోదీ ఫొటోతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బుర్రకథ

అలమూరు: మండలంలోని మోదుకూరులో గెయిల్ ఇండియా చేపడుతున్న కార్యక్రమాలపై సోమవారం బుర్రకథ ప్రదర్శన జరిగింది. రామచంద్రపురానికి చెందిన జాతీయ కళాకారుడు గొర్రెల రాము బృందం నిర్వహించిన బుర్రకథ స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది. గెయిల్ ఇండియా సంస్థ ఏర్పాటు చేసిన బుర్రకథలో పైప్‌లైన్ల రక్షణ, యంత్ర సామాగ్రి పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. హెచ్చరికల బోర్డులు, చిహ్నాలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలన్నారు. అలాగే మహాభారతంలోని ఉత్తర కల్యాణాన్ని బుర్రకథ రూపంలో తెలియజేశారు. కళాకారులు గొర్రెల కృష్ణ, జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేషనల్ ఇంటిగ్రేషన్ అవార్డు స్వీకరణ


అవార్డు అందుకుంటున్న భానుప్రసాద్

అలమూరు: మండలంలోని జొన్నాడలో పశు వైద్యాధికారిగా పనిచేస్తున్న జి.భానుప్రసాద్ నేషనల్ ఇంటిగ్రేషన్ అవార్డును స్వీకరించారు. పశు వైద్య వృత్తిలో విశేష ప్రతిభ కనబర్చి పశుగణాభివృద్ధికి తోడ్పాటును అందించినందుకు గాను హెల్త్ కేర్ ఇంటర్నేషనల్ సంస్థ రిపబ్లిక్‌డేను పురస్కరించుకుని అవార్డుకు ఎంపిక చేశాయి. అందులో భాగంగా ప్రతిష్టాత్మకమైన ఈ అవార్డును ఈనెల 22న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర నాయకుల చేతుల మీదుగా అందుకున్నారు. అలమూరు వెటర్నరీ ఏడీ ఎల్.అనిత, పశు వైద్య సిబ్బంది అభినందించారు.

బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధి మృతి

సఖినేటిపల్లి: వీవీమెరక గ్రామానికి చెందిన మలికిపురం ప్రగతి షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గుర్రం శ్యాంసన్ సోమవారం మృతి చెందారు. ఆయన మృతికి మలికిపురం అసోసియేషన్ సభ్యులు సంతాపం తెలిపారు.

చోరీకి పాల్పడిన దుండగులను అరెస్ట్ చేయాలి

సఖినేటిపల్లి: అప్పనరామునిలంక, అంతర్వేదిలోను ఆలయాల్లో వరుస చోరీలకు పాల్పడిన దుండగులను తక్షణం అరెస్ట్ చేసే దిశగా తగిన చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీ వేమా పోలీసులను డిమాండ్ చేశారు. సోమవారం అప్పనరామునిలంకలో దుండగులు చోరీకి పాల్పడిన శివాలయం, రామాలయాన్ని ఆయన సందర్శించారు. చోరీ జరిగిన తీరును పూజారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ ఇందుకూరి సుబ్బరాజు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

ఆత్రేయపురం: క్రీడలు శారీరక వ్యాయామంతో పాటు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని ఎంపీపీ కుండ అన్నపూర్ణ, జెడ్పీటీసీ బోణం సాయి బాబు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో నాతి బుజ్జి ఆధ్వర్యంలో ఇటీవల సంక్రాంతి సంబరాల్లో వివిధ అంశాల్లో గ్రామ సచివాలయ సిబ్బందికి నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఆటల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న ప్రతి ఒక్కరినీ అభినందించారు.

మట్టి లారీ సీజ్

పి.గన్నవరం: మండలంలోని పెదకందాలపాలెం ర్యాంపు నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న లారీని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించినట్టు పి.గన్నవరం ఎస్సై పి.గంగాభవాని తెలిపారు. దీనికి సంబంధించి లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఆమె వివరించారు.

నిత్యాన్నదానానికి విరాళం

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరుని ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదానానికి మండల మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు గంగుమళ్ల కాశీఅన్నపూర్ణ శ్రీనివాస్ దంపతులు సోమవారం రూ.11,116 విరాళం అందజేశారు. దాత ఈ సొమ్మును ఆలయ అర్చకులకు అందజేశారు. దాతను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

చోరీపై కేసు

పి.గన్నవరం: బెల్లంపూడిలోని చీకరమెల్లి ప్రసాద్ ఇంట్లో మూడున్నర కాసుల బంగారు నగలు, రూ.10 వేల నగదును గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన ఘటనపై పి.గన్నవరం ఎస్సై పి.గంగాభవాని సోమవారం కేసు నమోదు చేశారు. ప్రసాద్ ఇటీవల తమ బంగారు ఆభరణాలు, నగదును సూట్ కేసులో దాచి ఇంట్లో పెట్టాడు. సోమవారం సూట్ కేసు తెరిచే సరికి బంగారు ఆభరణాలు, నగదు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వివరించారు.

ప్రతిఒక్కరూ భద్రతా నియమాలు పాటించాలి


వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: భావిభారత పౌరులు తయారయ్యేది పాఠశాలల్లోనేనని విద్యార్థి దశ నుంచి రహదారి భద్రతా నియమాలపై అవగాహన కల్పించడంతో రోడ్డు ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చని ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి సూచించారు. 34వ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా రవాణాశాఖ ఆధ్వర్యంలో స్థానిక సెయింట్ పాట్రిక్స్ పాఠశాల సమావేశ మందిరంలో ఆటో, మ్యాక్సీక్యాబ్, టాక్సీ డ్రైవర్లకు, స్కూల్ బస్ డ్రైవర్లకు అలాగే నూతనంగా డ్రైవింగ్ లైసెన్స్ పొందుతున్న డ్రైవర్లకు రహదారి భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా రవాణాధికారి సీహెచ్ ప్రతాప్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ స్థానిక హైవే పై బ్లాక్ స్పాట్స్ గుర్తించి పోలీస్, రవాణా శాఖ, స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రమాదాలు జరగకుండా నివారించాలని కోరారు. వాహనరంగానికి చేయూతగా వాహనమిత్ర పథకంలో కొత్తపేట నియోజకవర్గానికి సుమారు రూ.1.42 కోట్లు ఆటో, ట్యాక్సీ, క్యాబ్ డ్రైవర్లకు మంజూరు చేశామన్నారు. మండలంలోని తొమ్మిది హైస్కూల్ విద్యార్థులకు రహదారి భద్రతపై వ్యాసరచన పోటీలు నిర్వహించి వారిలో పాఠశాలల వారీగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ఎమ్మెల్యే జగ్గిరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శ్రీనివాసరావు, సర్పంచ్ తాడేపల్లి నాగమణి, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, వైస్ ఎంపీపీ బొక్కా ప్రసాద్, ఎంపీటీసీ కె.విజయకుమారి, ఛాంబర్ అధ్యక్షుడు కర్రి నాగిరెడ్డి, ఎస్సై, ఎం.వెంకటరమణ, ఏఎంవీఐ కేవీ నాగేంద్ర, ఎంఈఓ హరిప్రసాద్, సెక్రటరీ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక రోగాలకు అత్యాధునిక వైద్యం

కిమ్స్ చైర్మన్ చైతన్యరాజు


రాజోలులో మెడ్ యునైటెడ్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాపాక తదితరులు

రాజోలు: గ్రామీణ ప్రాంతాల్లో దీర్ఘకాలిక రోగాలకు అత్యాధునిక వైద్యం అందించే దిశగా అడుగులు వేస్తున్నామని అమలాపురం కిమ్స్ ఆస్పత్రి చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) అన్నారు. సోమవారం రాజోలు పాతపోస్టాఫీసు వీధిలో ఏర్పాటు చేసిన మెడ్ యునైటెడ్ క్లినిక్‌ను రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ప్రారంభించగా, తాటిపాకలో ఏర్పాటు చేసిన క్లినిక్‌ను మాజీ ఎమ్మెల్యే గొల్లపల్లి సూర్యారావు ప్రారంభించారు. కిమ్స్ ఎండీ కె.రవికిరణ్ వర్మ మాట్లాడుతూ మెడ్ యునైటెడ్ క్లినిక్స్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో వైద్యం అందిస్తామన్నారు. ఇప్పటికే అమలాపురంలో ఈ తరహాలో సేవలు అందిస్తున్నామని, వచ్చే మార్చి నెలలో మలికిపురంలో ఒక సెంటర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. అత్యవసర వైద్యం కోసం కాకినాడ, రాజమహేంద్రవరం వెళ్లేందుకు సమయాభావంతో అత్యధికంగా ప్రాణనష్టం జరగడాన్ని గుర్తించామన్నారు. నిర్ణీత సమయంలో రోగికి వైద్యం అందించగలిగితే ప్రాణనష్టం తగ్గించవచ్చన్నారు. 365 రోజులు క్లినిక్స్‌లో సేవలు అందించే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. దీర్ఘకాలిక రోగాలకు వివిధ రకాల అత్యాధునిక వైద్య పరీక్షలు క్లినిక్స్‌లో చేయించుకోవచ్చన్నారు. ముఖ్యంగా క్లినిక్స్ వద్ద అంబులెన్స్ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా, ఎంపీపీ కేతా శ్రీనివాస్, జెడ్పీటీసీ మట్టా శైలజ, గుబ్బల మనోహర్, దార్ల పెదబాబు, మట్టా ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

అంబాజీపేట: మాచవరం ఇటికాలమ్మ, మహాలక్ష్మి అమ్మవార్ల ఆలయ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. స్థానిక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పి.గన్నవరం మండలం పోతవరం ప్రభల దిబ్బకు చెందిన కోరం లక్ష్మణరావు తన మోటారుసైకిల్‌పై మాచవరం పంచాయతీ మెట్లకాలనీలో ఉన్న తన అత్తగారింటికి వెళుతున్నాడు. ఇటికాలమ్మ, మహాలక్ష్మి అమ్మవార్ల ఆలయం వద్దకు వచ్చే సరికి అంబాజీపేట నుంచి పి.గన్నవరం వైపు వెళుతున్న లారి లక్ష్మణరావును ఢీ కొట్టింది. దాంతో లక్ష్మణరావుకు తీవ్రగాయాలు కాగా అమలాపురం ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడు లక్ష్మణరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ కె.హరిచంద్రప్రసాద్ తెలిపారు.

ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి


కొత్తపేటలో మాట్లాడుతున్న ఆర్డీవో ముక్కంటి

కొత్తపేట: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 25న డివిజన్‌లో వివిధ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించాలని స్థానిక ఆర్డీవో ఎం.ముక్కంటి బూత్ స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లకు సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహణపై ఆర్డీవో అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. 13వ జాతీయ ఓటర్ల దినోత్సవం కార్యక్రమాలపై సమీక్షించారు. 25న ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉన్న కొత్త ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించాలి. వారిని సత్కరించి, కొత్త ఓటరు గుర్తింపు కార్డులు అందజేయాలి. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద మధ్యాహ్నం 1 గంట తరువాత, పాఠశాలలు, కళాశాలల వద్ద విద్యార్థులకు 'మై భారత్ హూ' అనే హిందీ పాటను అందరికీ వినిపించాలి. అలా పలు కార్యక్రమాలపై ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఎలక్షన్ డీటీ విజయలక్ష్మి, డీటీ ఎస్.శ్రీనివాస్, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ అర్జమ్మ, ఆర్ఐ కొప్పిశెట్టి ఏడుకొండలు, సూపర్‌వైజర్లు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

అంతర్వేది శివాలయంలో ధ్వజారోహణ

సఖినేటిపల్లి: అంతర్వేది పుణ్యక్షేత్రానికి క్షేత్రపాలకుడైన పార్వతీ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రాత్రి ధ్వజారోహణ కార్యక్రమాన్ని అర్చకులు నిర్వహించారు. తొలుత విఘ్నేశ్వర పూజ, వాస్తుపూజ, అగ్నిప్రతిష్ఠాపన, బలిహరణం నిర్వహించారు. నేటి నుంచి ఈ నెల 27 వరకూ నిర్వహించనున్న నీలకంఠేశ్వరస్వామి వార్షిక దివ్య కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మొదటి రోజు పై కార్యక్రమాలు అర్చకులు మంగళ వాయిద్యాలతో, మంత్రాలతో ఘనంగా నిర్వహించారు. అంతర్వేది ఆలయ ఏసీ వి.సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

నేతాజీని ఆదర్శంగా తీసుకోవాలి


మలికిపురంలో నేతాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సత్యనారాయణమూర్తి

అంబాజీపేట/మలికిపురం/కొత్తపేట/పి.గన్నవరం: స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ ధైర్య సాహసాలను ప్రతి విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలని హెచ్‌ఎంలు ఏపీఎల్ వరప్రసాద్, బీర హనుమంతరావు, మోకా ప్రకాష్ అన్నారు. పుల్లేటికుర్రు, అంబాజీపేట, తొండవరం జెడ్పీ హైస్కూళ్లలో బోస్ జయంతిని సోమవారం నిర్వహించారు. మలికిపురంలోని ఎంవీఎస్‌జేఎస్ అండ్ ఆర్వీఆర్ ప్రభుత్వ ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కరస్పాండెంట్ మంగెన వెంకట సత్యనారాయణమూర్తి పూలమాల వేసి నివాళులర్పించారు. కొత్తపేటలో నేతాజీ జయంతిని వివిధ పార్టీల నాయకులు, కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. వాడపాలెంలో బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు పాలాటి మాధవస్వామి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పి.గన్నవరంలో సుభాష్ చంద్రబోస్ జయంతిని వివేకానంద యూత్ అధ్యక్షుడు బొరుసు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి నాయకులు పూల మాలలు వేసి, నివాళులు అర్పించారు.

కొనసాగుతున్న తీర్థం పనులు


అంతర్వేది దండుపుంత మార్గంలో రోడ్డు పనులు చేస్తున్న కార్మికులు

సఖినేటిపల్లి: అంతర్వేది పుణ్యక్షేత్రంలో రానున్న లక్ష్మీనృసింహుని తీర్థ మహోత్సవాలకు సంబంధించి వివిధ శాఖల ఆధ్వర్యాన పనులు కొనసాగుతున్నాయి. క్షేత్రానికి వెళ్లే దండుపుంత మార్గంలో రోడ్డు మరమ్మతులు జరుగుతున్నాయి. ఈ మార్గంలో గోతులను పూడ్చి, తారు వేసే పనులు చేస్తున్నారు. లక్ష్మీనృసింహుని సోదరి గుర్రాలక్క ఆలయం వద్ద పందిరి వేసే పనులు జరుగుతున్నాయి. రథయాత్రలో స్వామివారు సోదరికి చీర, సారె ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. ఈ కార్యక్రమాన్ని అర్చకులు నిర్వహిస్తారు. మెయిన్ టెంపుల వద్ద వెలుపల భక్తుల క్యూ ఏర్పాటు చేశారు. వీటితో పాటు అంతర్వేది 12 ఎకరాల మంచినీటి చెరువులోని నిల్వ నీటిని ఇంజన్లతో తోడే పనులు కొనసాగుతున్నాయి. చెరువులో నిల్వ నీటిమట్టం క్రమేపీ తగ్గుతోంది. తదనంతరం అంతర్వేది చానల్ ద్వారా నీటిని చెరువుకు పంపే ఏర్పాట్లు అధికారులు ప్రారంభిస్తారు.